క్లుప్తంగా

నేడు శ్రీ రాఘవేంద్ర స్వామి ప్రతిష్ఠాపన



నారాయణపేట: శ్రీ లక్ష్మీనరసింహ సహిత రాఘవేంద్ర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు నరసింహాచారి తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం మహారథోత్సవం, భజన పల్లకి సేవా తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అక్షతల తరలింపు



దామరగిద్ద: అయోధ్య రాములయ పునఃనిర్మాణం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొగుల్‌మడ్కలో అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ ద్వారా అందజేసిన అక్షతలను భక్తి శ్రద్ధలతో తరలించారు. శనివారం రాత్రి స్థానిక రామాలయ భజన మండలి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలతో రామాలయానికి అక్షతలను ఊరేగింపుగా తరలించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఇంటింటికీ అక్షతలు, కరపత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ తప్పనిసరి

ధన్వాడ: గ్యాస్ వినియోగదారులు సిలిండర్ ప్రమాదవశాత్తు పేలితే జరిగే నష్టానికి పైసాలేకుండా సుమారు రూ.5లక్షల నుంచి రూ.50లక్షల వరకు ప్రమాద బీమా పొందే వీలుంటుందని దీనికోసం తనిఖీ తప్పనిసరి అని ఇండియన్ గ్యాస్ డీలర్ ఉసుబాలకృష్ణ అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రతి గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సిలిండర్ కనెక్షన్‌ను తనిఖీ చేసి అన్నిసరిగ్గా ఉంటే రూ.236 చెల్లించి రసీద్ తీసుకుంటే వారికి బీమా వర్తిస్తుందన్నారు. మండలంలో ఇంటింటికీ తనిఖీ జరుగుతుందని, లబ్ధిదారులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదినం

నర్వ: మాజీ అడ్వొకేట్ జనరల్ అమరచింత దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు శరణప్ప, న్యాయవాది జీకే రాములు, విజయ్, చిన్న పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



మక్తల్‌లో ఓ బేకరి వద్ద కేక్‌ను తీసుకెళుతున్న యువకులు

మక్తల్/నర్వ/దామరగిద్ద: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి.. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు పట్టణంలోని యువత ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. పట్టణంలోని ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. వేడుకల్లో కేక్ కటింగ్‌లకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్న జనం వాటిని కొనుగోలు చేయడం కోసం పట్టణంలోని బేకరీల వద్ద బారులు తీరారు. ఆయా వర్గాల వారికి అనుగుణంగా బేకరీల నిర్వాహకులు సైతం వివిధ డిజైన్లతో కేక్‌లను తయారు చేసి అందించడంలో నిమగ్నమయ్యారు. వినియోగదారుల కోరిక మేరకు ప్లమ్ కేక్, డ్రైఫ్రూట్ ప్లమ్, మఫిన్స్ కేక్‌లతోపాటు శాఖహారుల కోసం ఎగ్‌లెస్ కేక్‌లు అందుబాటు ఉంచారు. పట్టణంలోని 70కుపైగా బేకరీల్లో న్యూఇయర్ వేడుకలకు దాదాపు 60వేల నుంచి 70వేలకు పైగా కేక్‌లను అందుబాటులో ఉంచడం గమనార్హం. కాగా కిలో కూల్ కేకు రూ.200నుంచి రూ.1000వరకు తీసుకుంటున్నారు.



దామరగిద్దలో కేక్‌కట్ చేస్తున్న యువకులు



ఓ బేకరి వద్ద కేక్‌ను కొనుగోలు చేస్తున్న యువకులు



భగత్‌సింగ్ స్ఫూర్తితో సిద్ధం కావాలి



ఆవిర్భవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నారాయణపేట: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడేందుకు విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమ్మిర్ కిరణ్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా కార్యదర్శి నరహరి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు మోహన్ ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ పరిరక్షణకోసం నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తువస్తుందన్నారు. దేశంలోని విద్యార్థులను ఏకం చేసి విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ తన భుజస్కంధాలపై వేసుకుందన్నారు. దేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఎస్‌ఎఫ్‌ఐ తన గళాన్ని వినిపిస్తుందన్నారు. దేశంలో సమానత్వాన్ని సాధించేందుకు ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. అమరవీరులను తలచుకొని నేటి తరం భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నరేష్, పవన్‌కుమార్, రాకేష్, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కులను అందజేస్తున్న నందునామాజీ

నారాయణపేట: ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ అన్నారు. జిల్లాలోని ముగ్గురు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన వారికి మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బాధితకుటుంబాలకు ఆదివారం తన కార్యాలయంలో ఆయన అందజేశారు. చెక్కులను అందుకున్నవారిలో మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన బోయ రాధకు రూ. 60 వేలు, దామరగిద్ద మండలంలోని సజనాపూర్ ఎల్లమ్మకు రూ. 18వేలు, ధన్వాడ మండలంలోని మంత్రోనిపల్లి అనంతమ్మకు రూ. 8వేల చెక్కులను అందుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డిపల్లి రాము, కోశాధికారి హన్మంతరావు, మాకం సురేందర్, దామరగిద్ద మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డికొమరయ్య ఆశయాలను కొనసాగిద్దాం



దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ సభ్యులు

నారాయణపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య వారసులమైన మనం ఆయన ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం గౌరవ అధ్యక్షుడు కందూరి వెంకటరాముడు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సిటిజన్స్‌క్లబ్‌లో దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణానికి జేఏసీ చైర్మన్ వడ్ల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం కొమరయ్య చేసిన పోరాటం అమోఘమైందన్నారు. అనంతరం దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా వడ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్‌గా బండి వేణుగోపాల్, జిల్లా కన్వీనర్‌గా ఎల్.మనోహర్‌ప్రసాద్‌గౌడ్, కో కన్వీనర్‌గా కురువ సుధాకర్, కాశీనాథ్, సరాఫ్‌నాగరాజును ఎన్నుకున్నారు. దొడ్డి కొమరయ్య సినిమా డైరక్టర్‌ఎం.సేనాపతి, డాక్టర్ సాయిబాబా, రఘురామయ్యగౌడ్, గోపాల్‌యాదవ్, నర్సింహులు, శివకుమార్, బల్‌రాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



మాగనూర్: మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన వాకిటి శ్రీహరిని మండలానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన నివాసంలో ఆదివారం శాలువాతో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరి మాగనూర్ మండల సంపూర్ణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండల ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సరిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మటన్ ధరల పెంపుదలపై ఆందోళన

మరికల్: మండల కేంద్రంలో వ్యాపారులు మటన్ ధరలు పెంచడంతో ఆదివారం యువక మండలి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి సమాచారం లేకుండా కిలో మటన్ రూ.600 ఉండగా, రాత్రికి రాత్రే రూ.100 పెంచడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తగ్గించాలని, లేకుంటే మటన్ కొనుగోలు నిలిపివేస్తామని వ్యాపారులను హెచ్చరించారు. ఈ విషయంపై సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఎందుకూ స్పందించకపోవడం సిగ్గు చేట్టాన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో కిలో మటన్ రూ.600 ఉంటే మరికల్‌లో ఎందుకు రూ.700లకు పెంచారని ప్రశ్నించడంతో వ్యాపారులు దిగ్గివచ్చి ధరలను దించుతామని ఒప్పుకోవడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, రవి, రఘు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భూమాత, గోమాతను నిర్లక్ష్యం చేస్తే అనర్థాలే



మాట్లాడుతున్న ఆకుతోట రామారావు

మహబూబ్‌నగర్ రూరల్: భూమాతను, గోమాతను నిర్లక్ష్యం చేస్తున్న కారణంగానే అనేక అనర్థాలు జరుగుతున్నాయని తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఆర్‌ఎస్‌ఎస్ సమన్వయ కర్త ఆకుతోట రామారావు అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గల కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జరిగిన ప్రకృతి రైతుల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గో సంరక్షణ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణతో పాటు నేలతల్లి సారవంతమవుతుందని అన్నారు. గ్రామ భారతి జిల్లా అధ్యక్షుడు అమరవాది రాజనరసింహా, గో సేవా ప్రముఖ్ ముకుందరెడ్డి, ప్రచార కార్యదర్శి గుముడాల చక్రవర్తిగౌడ్, బస్వరాజ్, ఉమాదేవి పాల్గొన్నారు.

వికసిత భారత్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంక్ అధికారులు



మరికల్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో వికసించిన భారత్ అభివృద్ధిని చాటే క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో బ్యాంక్ అధికారులు, బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కేంద్ర పథకాలను విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘురామయ్యగౌడ్, నందు నామాజీ, మిర్చి వెంకటయ్య, అప్పిరెడ్డిపల్లి రాము, అశోక్ పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో ఆదివారం మండల వీరశైవ లింగయత్ ఆధ్వర్యంలో ఆ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బసంత్, జగదీష్ మాట్లాడుతూ కొత్త ఏడాదిలో తమ సంఘం తరపున స్వచ్ఛంద సేవ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీరన్న, జగదీశ్, బస్వరాజ్, బసంత్, శివకుమార్, షకిరప్ప, సామనాథ్, శివ శరణప్ప పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్నశ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి

కృష్ణా: ప్రతి ఒక్కరూ భక్త కనకదాసుడు సూచించిన మార్గంలో నడుచుకోవాలని పీఠాధిపతి శ్రీ సిద్ధరామనందపురి మహాస్వామి, నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగా మహాస్వామిపిలుపునిచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలోని శ్రీ క్షీరాలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ మఠాధిపతులతో భక్త కనకదాసుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు వారు సూచించిన మార్గంలో నడచుకుంటే ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో లింగప్పతాత, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, మండల నాయకులు శివరాజ్‌పాటీల్, మహాదేవ్, కురుమ సంఘం నాయకులు మాలింగా, నాగరాజ్, సురేష్, కీరప్ప పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో మాగనూర్-కొత్తపల్లి ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ముళ్ల పొదలు పెరిగి కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించి విద్యుత్ కట్ట ఎత్తుపెంచాలని కోరుతున్నారు.

నేడు అయ్యప్పపడిపూజ

మక్తల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి మహాపడిపూజను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రకాంత్‌గౌడ్ తెలిపారు. మహాపూజ సందర్భంగా గ్రామంలో కలశ ఊరేగింపు, మహాపడిపూజ, అన్నదానం నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

ప్రధాని మోదీ నిర్ణయంపై హర్షం

మరికల్: అయోధ్యలో నిర్మించిన అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు మహర్షి వాల్మీకి పేరు పెట్టి ప్రారంభించడంతో ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని వాల్మీకి సంఘం నాయకులు నర్సింహులు, చంద్రప్ప, తిరుపతయ్య, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రామాయణం రచించిన వాల్మీకిని ప్రపంచ దేశాలు గుర్తించేలా చేయడంపై ఆనందంగా ఉందన్నారు.

ప్రమాదకరంగా గుంత

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ నుంచి నేరడగం గ్రామం వెళ్లే మర్గంలో గుంతలు తీసి పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో అవి ప్రమాదకరం మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయందోళన చెందుతున్నారు. అధికారులు గుంతను పూడ్చివేయించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.